భారత్ బచావో..మోడీ హటావో

ఏప్రిల్ 14 నుంచి సీపీఐ పాదయాత్ర

విశాలాంధ్ర-మండపేట: భారత కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో భారత్ బచావో..మోడీ హటావో..అనే నినాదంతో ప్రజా సమస్యలపై ఉద్యమించ డానికి శ్రీకారం చుట్టినట్లు సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు దేగా ప్రభాకర్, సీపీఐ జిల్లా కార్యదర్శి కే సత్తిబాబు, తెలిపారు. ఉద్యమాల గడ్డ ఏడిద గ్రామంలో శనివారం సీపీఐ నాయకులతో మండపేట నియోజక వర్గ జనరల్ బాడీ సమావేశం జరిగింది. పెన్మత్స జగ్గరాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి దేగా ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భారత్ బచ్చావో-మోడీ హటావో అనే నినాదంతో ప్రజాసమస్యలపై గళమెత్తడానికి కార్యాచరణ రూపొందించామన్నారు. ఏప్రిల్ 14 నుంచి కమ్యూనిస్టు పార్టీ తరపున పాదయాత్రకు పిలుపు నిచ్చామన్నారు. ఈ పాదయాత్రకు నియోజక వర్గంలోని కమ్యూనిస్టు నాయకులు, కార్యకర్తలు, అభ్యుదయ వాదులు తరలిరావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో పోలవరం ప్రాజెక్టు నిర్మాణం, నిర్వాసితుల సమస్యలు జాతీయ స్థాయిలో రైతు సమస్యల్ని, విశాఖ ఉక్కు ప్రభుత్వ రంగ సంస్థను కాపాడుకునే దిశగా ముందుకు వెళ్లాలని అన్నారు. రాజ్యాంగ పరిరక్షణ దిశగా పార్టీ పనిచేయాలని దిశా నిర్దేశించారు. సీపీఐ జిల్లా కార్యదర్శి కె సత్తిబాబు మాట్లాడుతూ జిల్లా ప్రయోజనాలే లక్ష్యంగా కార్యాచరణ ఉంటుందన్నారు. వేగిర శామ్యూల్, లంకే కామేశ్వరరావులు, పార్టీ మండల కార్యదర్శిలు చిట్టూరి ప్రసాద్, బందారు సావిత్రి, సత్తిబాబు మాట్లాడుతూ వ్యవసాయ ఆధారిత ప్రాంతమైన డాక్టర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాకు కనీస మౌలిక వసతులు కల్పించకుండా విభజన చేసారన్నారు. మిగిలిన రెండు జిల్లాలు అభివృద్ధి చెందాయన్నారు. కోనసీమలో పరిశ్రమలు తీసుకురావాలని అందు కోసం పార్టీ పనిచేయాల్సి ఉందన్నారు. దానికి పార్టీ శ్రేణుల్ని బలోపేతం కావాలని సూచించారు. పార్టీ సభ్యత్వం, ప్రజా సంఘాల నిర్మాణం చేపట్టాలని పిలుపునిచ్చారు. మహిళా సమాఖ్య జిల్లా మహసభలు స్థానికంగా నిర్వహించాలని శ్యామ్ ప్రతిపాదించగా సమావేశంలోని సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు.

కొవ్వూరు టోల్ గేట్ సిబ్బందిని అక్రమంగా తొలగిస్తే ఉద్యమం

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: కొవ్వూరు టోల్ గేట్ సిబ్బందిని పాత్ ఇండియా యాజమాన్యం అక్రమంగా తొలగిస్తే ఏఐటీయూసీ దశలు వారి పోరాటం నిర్వహిస్తామని ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షులు తాటిపాక మధు పిలుపు నిచ్చారు. శనివారం కార్మిక శాఖ సహాయ అధికారిని కలిసి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ కుంద్రపు రాంబాబు మాట్లాడుతూ గత 8 సంవత్సరాలుగా టోల్ గేట్ లో పనిచేస్తున్న వారికి జాబ్ ఆర్డరు, ఐ డి కార్డు కూడా ఇవ్వలేదని అన్నారు అన్యాయం గా కార్మికులను తొలగిస్తే టోల్ వద్ద ఆందో ళన చేస్తామని అన్నారు. ఎసిఎల్ ను కలిసిన వారిలో ఏఐటీయూసీ నాయకులు వి. కొండలరావు , ఎం ఎస్ రాజు , నాని కుమార్ సాయి తదితరులు పాల్గొన్నారు.

మొదటి స్థానం సాధిస్తే యాభై వేల బహుమతి

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో మొదటి స్థానం సాధించిన విద్యార్థికి యాభై వేల రూపాయలు నగదు బహుమతిని సీపీఐ ఎంఎల్ రాష్ట్ర కమిటీ సభ్యుడు పలివెల వీరబాబు ప్రకటించారు. చినకొండపూడి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశలలో పదవ తరగతి విద్యార్థులెవరైనా మండల మొదటి స్థానంలో మార్కులను పొందగలిగితే 50 వేల రూపాయల నగదు, ఆ విద్యార్థి ఉన్నత చదువులను అభ్యసించుటకు తగిన ప్రోత్సాహాన్ని అందిస్తానని సిపిఐ (ఎంఎల్) పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు, తూర్పుగోదావరి జిల్లా కార్యదర్శి పలివెల వీరబాబు హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలివెల వీరబాబు మాట్లాడుతూ అన్ని ధానాలకన్నా విద్యా దానం ఎంతో గొప్పదన్నారు. చదువును నమ్ముకున్న వారు ఇప్పటివరకు ఎవరు బాధపడినవారు లేదని చదువు అనేది సమాజంలో కీర్తి ప్రతిష్టలను గౌరవాన్ని పెంచుతుందని తెలియజేశారు. అనంతరం పరీక్షలు బాగా రాసేందుకు పెన్ను లను అందించినందుకు వీరబాబుకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, సిపిఐ (ఎంఎల్) పార్టీ జిల్లా కమిటీ సభ్యులు నందమూరి స్వామి,పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

పదవ తరగతి పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం

విశాలాంధ్ర - సీతానగరం : మండలంలో పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు మండల విద్యాధికారి స్వామి నాయక్ అన్నారు. ఈ సందర్భంగా స్వామి నాయక్ విలేకరులతో మాట్లాడుతూ సీతానగరం మండలంలో 674 విద్యార్థులు, రాజమహేంద్రవరం తొర్రేడు పాఠశాల నుండి 166 మంది కలిసి మొత్తం 840 విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు ఎంపిక చేసిన 5 సెంటర్లలలో చినకొండేపూడి 2, సీతానగరం 1, రఘుదేవపురం 1, వెదుళ్లపల్లి 1 పరీక్షలు నిర్వహణ జరుగుతుందని అన్నారు. విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా త్రాగు నీరు, విద్యుత్, బెంచీలు మొదలగు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు పరీక్షకు ఒక్క నిమిషం ఆలస్యంగా వచ్చినా పరీక్షకు అనుమతి లేదని స్పష్టం చేశారు. విద్యార్థులందరూ పరీక్షలు బాగా రాసి మండలానికి మంచి పేరు తేవాలని కోరారు.

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకు వెళ్ళాలి

విశాలాంధ్ర - నిడదవోలు : తెలుగు దేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడును విజయవాడలోని ఆయన నివాసంలో నిడదవోలు తెలుగుదేశం పార్టీ ఇన్ ఛార్జ్ బూరుగుపల్లి శేషా రావు మర్యా దపూర్వకంగా శనివారం కలిశారు. ఈ సందర్భంగా నిడదవోలు నియోజకవర్గంలో జరుగు చున్న ఇదేం కర్మ ఈ రాష్ట్రానికి, ఓటర్ వెరిఫికేషన్, బూత్ హౌస్ మేపింగ్ తదితర కార్యక్రమాల పై చర్చించారు. నిడదవోలు నియోజ కవర్గంలో తెలుగుదేశంపార్టీ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు వైసిపి ప్రభుత్వ ప్రజ వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి మరింత విస్తృతంగా తీసుకు వెళ్ళాలని నారా చంద్రబాబునాయుడు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాదించినందుకు బూరుగుపల్లి శేషారావు చంద్రబాబు కు అభినందనలు తెలిపారు.

ఉత్తమ విభాగాధిపతి అవార్డుకి డాక్టర్ యర్రంశెట్టి

విశాలాంధ్ర-మామిడికుదురు: మామిడికుదురు దీప్తి డిగ్రీ కళాశాల ఫిజిక్స్, ఎలక్ట్రానిక్స్ విభాగాధిపతి డాక్టర్ విజయ్ సత్యప్రసాద్ యర్రంశెట్టి 2023 ఉత్తమ విభాగా ధిపతి అవార్డుకు ఎంపికైనట్లు బెంగ ళూరుకు చెందిన ఐఎస్ఎస్సీ ఇంటర్నేషనల్ స్కాలర్స్ సంస్థ నుంచి ఆయనకు శనివారం మెయిల్ అందినట్ల చెప్పారు. భౌతిక శాస్త్రంలో ఆయన నానోటెక్నాలజీ అంశంపై పరిశోధన పత్రాన్ని ఈ ఏడాది మార్చి 9న ఆన్లైన్ వేదికగా విశ్లేషణ చేసి పలువురు జాతీయ, అంతర్జాతీయ నిపుణుల మన్ననలు అందుకున్నందుకు ఈ అవార్డుకు ఎంపిక చేసినట్లు ఆ సంస్థ మెయిల్లో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్, ఒడిస్సా రాష్ట్రాల్లో పలు విశ్వ విద్యాలయాల విద్యార్థులకు భౌతిక, ఎలక్ట్రానిక్స్ సబ్జెక్ట్ లో విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో పుస్తకాలు రాస్తున్నందుకు, అన్ని స్థాయి విద్యార్థులను ఉత్తమ వ్యక్తిత్వ వికాస కథనాలతో మోటివేషన్ చేస్తున్నందుకు గాను ఈ అవార్డు ప్రకటించినట్లు ఆ సంస్థ లేఖలో పేర్కొంది. ఆయన ఈ అవార్డుకు ఎంపిక కావడం పట్ల కళాశాల చైర్మన్ డివివి సత్యనారాయణ, పలు సబ్జెక్ట విభాగాధి పతులు మోకా రంగారావు, యాలంగి రవికుమార్, గాదరాడ రవిచంద్ర, పొన్న మండ సుబ్బారావు, బి సృజన తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

దాడులు, దోపిడీలే వైసీపీ లక్ష్యాలు

విశాలాంధ్ర-కాకినాడ : జనం కోసం పవన్-పవన్ కోసం మనం కార్యక్రమంలో భాగంగా సిరి వెళ్ల అచ్యుతపురం, బెన్నిగారి చర్చ్, మధుర నగర్ ప్రాంతాల్లో ఇంటింటికి పాదయాత్ర చేస్తూ సమస్యలు తెలుసుకుంటూ వైసీపీ ప్రభుత్వం దాడులను, దోపిడీలను ప్రోత్సహిస్తోందని, కాకినాడలో ఉన్న కంపెనీల్లో ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకొని యంత్రాంగం, పైరవీలు చేసి కోట్లు వసూలు చేస్తున్న స్థానిక ప్రజా ప్రతినిధులు, అయోమయంలో కార్మికులు. అధికార పార్టీ నాయకుల ప్రోద్భలంతో విస్తృతంగా అక్రమ రవాణా చేస్తున్న రేషన్ బియ్యం మరియు ప్రజా ప్రతినిధుల అండతో నిత్యం వందల లారీలతో మట్టి తవ్వకాలు పట్టించుకొని ప్రభుత్వ యంత్రంగం అని వైసీపీ ప్రభుత్వ పాలనను దుయ్యబట్టారు.

విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను అడ్డుకుంటాం

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ విరమించే వరకు పోరాటం కొనసాగుతుందని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. స్టీల్ ప్లాంట్ అమ్మకానికి వ్యతిరేకంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ రాష్ట్ర పిలుపుమేరకు తూర్పుగోదావరి జిల్లా, రాజమహేంద్రవరం, స్థానిక శ్యామల సెంటర్లో సీఐటీయూ, ఏఐటీయూసీ,ఎస్.ఎఫ్. ఐ, డివైఎఫ్ఐ, కె.వి.పిఎస్, ప్రజా సంఘాలు, అభ్యుదయవాదులు,ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాను ఉద్దేశించి సిపిఎం, సిపిఐ జిల్లా కార్యదర్శులు టి. అరుణ్, టి. మధు మాట్లాడుతూ మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిననాటి నుంచి గత ప్రభుత్వాలు నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటుపరం చేయడం తప్ప ఒక్క పరిశ్రమను కూడా స్థాపించలేదని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక హోదా,విభజన హామీలు, పోలవరానికి నిధులు, వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు, వంటివి ఇవ్వకుండా తీవ్ర ద్రోహం చేసిందని, ఇది చాలదన్నట్టు రాష్ట్రంలో ఉన్న ఏకైక పెద్ద పరిశ్రమ అయిన విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటుపరం చేయడం సిగ్గుమాలిన చర్య అని విమర్శించారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు ఎం. సుందర బాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రాజులోవ, ఏఐటీయూసీ జిల్లా కన్వీనర్ రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు రెండు లక్షల మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగాఉపాధి కల్పిస్తున్న ఏకైక పెద్ద పరిశ్రమ విశాఖ స్టీల్ ప్లాంట్ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాటం ప్రారం భించి నేటికి 700 రోజు పూర్తయ్యిందని, విశాఖ ఉక్కును కాపాడుకునేం దుకు ఎన్ని వందల రోజులైనా పోరాడుతామని అన్నారు. సమావేశంలో కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జువ్వల రాంబాబు, నల్లా రామారావు మాటా డారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. ఎస్. మూర్తి, కర్రి రామకృష్ణ, జిల్లా కార్యదర్శి బి. పూర్ణిమ రాజు, సీఐటీయూ నాయకులు సోమేశ్వరం రావు, రాము, అప్పలనర్సయ్య, తాతారావు, రుద్ర రామకృష్ణ, పడాల రామకృష్ణ, పోలిన వెంకటేశ్వరరావు, పి.ఎస్.ఎన్.రాజు, ఐ.ఎస్, ఎస్.ఎఫ్.ఐ.జిల్లా అధ్యక్షులు వి.రాంబాబు, డి.వై.ఎఫ్.ఐ జిల్లా నాయకులు టి.రాజష్ ఏఐటీయూసీ నాయకులు నల్లా రామారావు సప్ప రమణ, జి. దేవుడు, ఆర్. వెంకటరావు, జి. వెంకటరావు, కె. అప్పలనాయుడు, రామా రావు, కె.రామకృష్ణ, భద్రరావు, తదితరులు పాల్గొన్నారు.

కాకినాడలో : విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో విశాఖ ఉక్కు స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చేస్తున్న ఉద్యమానికి ఏప్రిల్ ఒకటో తేదీ నాటికి 700 రోజులైన సందర్భంగా రాష్ట్రవ్యాప్త కేంద్ర కార్మిక సంఘాల పిలుపులో భాగంగా కాకినాడలో స్థానిక జిజిహెచ్ ఎదురుగా పూలే విగ్రహం వద్ద శనివారం కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర సన ధర్నా జరిగింది. ఈ ధర్నా ను ఉద్దేశించి సిఐటియు అఖిలభారత ఉపాధ్యక్షురాలు బేబీ రాణి, ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల ప్రసాద్లు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్ నూరు శాతం అమ్మాలనే కేంద్ర బిజెపి ప్రభుత్వం నిర్ణయానికి వ్యతిరేకంగా విశాఖ నగరంలో గాంధీ బొమ్మ వద్ద చేస్తున్న నిరసన దీక్షకు ఈ రోజుకి 700 రోజులైన సందర్భంగా రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా శనివారం కాకినాడ కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేస్తున్నామని, గత 26 మాసాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పోరాటం విశాఖ స్టీల్ ప్లాంట్ అమ్మకం దిశగా ఒక్క అడుగు కూడా ముందుకు వేయకుండా కేంద్ర ప్రభుత్వాన్ని అడ్డుకోగలిగిందని వారన్నారు. ఐఎన్టియుసి జిల్లా అధ్యక్షులు తాళ్లూరి రాజు, ఐఎఫ్టియు రాష్ట్ర అధ్యక్షులు ఎం, యేసు మాట్లాడుతూ విశాఖ స్టీల్ ప్లాంట్లో ఉత్పత్తి చూడవలసిన డైరెక్టర్ ఆపరేషన్ ఎందుకు కేంద్ర ప్రభుత్వం నియమించలేదని, స్టీల్ ఉత్పత్తి గురించి తెలియని అధికారుల్ని తెచ్చి సీఎండీగా విశాఖ స్టీల్ ప్లాంట్ పై కేంద్ర ప్రభుత్వం రుద్దుతున్నదని, స్టీల్ ప్లాంట్ను నష్టాల్లో చూపించి తొందరగా పోస్కోకు, కార్పొరేట్లకు అమ్మాలనే దుర్మార్గమైన కుట్ర కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్నదని అన్నారు. టిఎన్టియుసి జిల్లా అధ్యక్షులు గదుల సాయిబాబా, ఐఎఫ్టియు జిల్లా నాయకులు బంగారు సత్యనారాయణలు మాట్లాడుతూ రాష్ట్రంలో అధికారంలో ఉన్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఈ పరిణామాలను ఎక్కడా వ్యతిరేకించలేదని, ప్రభుత్వ కుట్రే ప్రధాన కారణమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు పిఎస్ నారాయణ, పెద్ది రెడ్ల సత్యనారాయణ, రెడ్డి బోడకొండ, బొబ్బిలి శ్రీనివాసరావు, రామయ్య, అనిల్, కాశీ విశ్వనాథ్, సిఐటియు జిల్లా అధ్యక్షులు శేషు బాబ్జి, నగర అధ్యక్షులు పలివెల వీరబాబు, మలకా వెంకటరమణ, మేడిశెట్టి వెంకటరమణ, చంద్రమల్లె పద్మ, నార్ల ఈశ్వరి, సిహెచ్ విజయ్ కుమార్, టిఎన్టియుసి గంగాధర్, పరశురాం, కర్రీ రామోజీరావు, పెద్ద, సత్తిబాబు, ఐఎఫ్టియు నాయకులు గుబ్బల ఆదినారాయణ, రఘువులు, చిట్టి అబ్బాయి, బొబ్బిలి రాజేష్, ఐఎన్టియుసి నాయకులు శివ, తాతబ్బాయి, సూరిబాబు తదితర ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణంతో కొప్పవరానికి మహర్దశ

విశాలాంధ్ర - అనపర్తి : కొప్పవరం గ్రామానికి సరైన రహదారులు కూడా ఉండేవి కావని మన ప్రభుత్వం అధికా రంలోకి వచ్చిన తర్వాత మహేంద్రవాడ వయా కొప్ప వరం మీదుగా లక్ష్మీ నరసాపురం, పొలమూరు నుండి కొప్పవరం, అనపర్తి నుండి కొప్పవరం మీదుగా కాంద్రేగుల వెళ్లే విధంగా రోడ్డు అభివృద్ధి చేయడం జరిగిందని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి అన్నారు. శనివారం కొప్ప వరంలో దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం పైన ఏర్పాటు చేసిన మండపాన్ని ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి ఆదిలక్ష్మి దంపతులు ప్రారంభించారు. గ్రామపంచాయతీ రెండవ సంవత్సరపు ఆదాయ విష యాలపై ముద్రించిన కరపత్రాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఎమ్మెల్యే సత్తి మాట్లాడుతూ సచివాలయం, రైతు భరోసా, వెల్నెస్ సెంటర్ నిర్మాణాలు త్వర లోనే పూర్తవుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల అధ్యక్షులు సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), జడ్పిటిసి సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, వైస్ ఎంపీపీ పులగం బుల్లి రెడ్డి, సర్పంచ్లు కర్రి బుల్లి మోహన్ రెడ్డి,గొల్లు హేమ తులసి (కుతుకులూరు), వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పడాల శ్రీనివాసరెడ్డి, మాజీ సర్పంచులు తాడి వెంకట రామకృష్ణారెడ్డి, తాడి సూరారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అరసం వ్యాసరచన పోటీల్లో ఆదిత్య విద్యార్థులు ప్రతిభ

విశాలాంధ్ర- రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) తూర్పుగోదావరి జిల్లా శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థులు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు గెల్చుకొని ప్రతిభ కనబరిచినట్లు అరసం తూర్పుగోదావరి జిల్లా శాఖ కన్వీనర్ పడాల వీరభద్రరావు తెలియజేశారు. మానవతా విలువలుబి అవశ్యకత, మహిళలపై అత్యాచారాలుబి పరిష్కార మార్గాలు, సాహిత్య పఠనంబి బ్రతుకు నిస్తుందా!? అనే అంశాలపై జరిగిన వ్యాసరచన పోటీల్లో ఆదిత్య డిగ్రీ కళాశాల విద్యార్థి డి .జ్యోతిబి ప్రథమ బహుమతి, ఎ. భాను స్వరూప-ద్వితీయ బహుమతి, ఎస్. బేబీ ఐశ్వర్య, శ్రీ చైతన్య బాలాంత్రపు తృతీయ బహుమతి, ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల విద్యార్థి డి.రేణుకా దేవి ప్రథమ బహుమతి, మట్టా తేజస్విని, వై.సుస్మిత ద్వితీయ బహుమతి, రంభ జాహ్నవి తృతీయ బహుమతి, వి. జె.ఎస్.కాలేజ్ ఆఫ్ ఫార్మసీ విద్యార్థి కె. హర్షిత్ రెడ్డి ప్రత్యేక బహుమతి గెలుచుకున్నారు. ఆదిత్య డిగ్రీ కళాశాల తెలుగు లెక్చరర్ లు డా. బి హెచ్.వి.రమాదేవి,ఎల్. వేంకటేశ్వరరావు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

వైఎస్ జగన్‌ది అందలం ఎక్కించిన ఘనత

విశాలాంధ్ర - మండపేట : మాజీ సీఎం చంద్రబాబు నాయుడిది మహిళలను మోస గించిన చరిత్రైతే, మహిళా భ్యున్నతే లక్ష్యంగా చేసుకుని వారికి ప్రోత్సా హకాలు అందించి అందలం ఎక్కించిన ఘనత రాష్ట్ర ప్రజల ఆరాధ్య నాయకుడు సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. ప్రభుత్వం మూడో విడత అందజేస్తున్న వైఎస్సార్ ఆసరా సంబరాలు మండపేట నియోజక వర్గంలో ఘనంగా జరుగుతున్నాయి. మరో నాలుగు రోజుల పాటు జరిగే వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీలో భాగంగా శనివారం మండపేట రూరల్ ఏడిద, అర్తమూరు గ్రామాల్లో చెక్కుల పంపిణీ సభలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు గారపాటి సౌజన్య అశోక్ కుమార్, పిల్లా వెంకటలక్ష్మి, నలమామిడి కృపరాజు, వాసంశెట్టి రాజేశ్వరి, ఉప సర్పంచ్ వరద చక్రవర్తి, వైసీపీ రూరల్ కన్వీనర్ పిల్లా వీరబాబు, పార్టీ నాయకులు పలివెల సుధాకర్, సొసైటీ చైర్మన్ రామిశెట్టి శ్రీహరిబాబు, చిలుకూరి బుజ్జి, వైస్ ఎంపీపీ పసుమర్తి నాగబాబు, నాగిరెడ్డి రాంబాబు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, డ్వాక్రా మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పట్టుదలతో చదివితే సమాజానికి మంచిపేరు

విశాలాంధ్ర - గోపాలపురం : కృషి పట్టుదలతో చదివి తల్లిదండ్రులకు సమాజానికి మంచి పేరు తేవాలని మానవతా స్వచంద సేవా సంస్థ అధ్యక్షుడు జొన్నలుగడ్డ రాంబాబు తెలిపారు. శనివారం స్థానిక జిల్లా పరిషత్ హై స్కూల్ నందు 10 వ తరగతి విద్యార్థులకు దాతల ఆర్థిక సహాయంతో 160 మంది పదో తరగతి విద్యార్థులకు పరీక్షల కిట్లను అందజేశారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ కష్టంతో కాక ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చు అన్నారు. ప్రభుత్వ స్కూళ్లలో చదివిన ఎంతోమంది ఉన్నత స్థానాల్లో వివిధ హోదాల్లో స్థిరపడ్డారని గుర్తు చేశారు. ఏడాది పాఠశాలకు నూరు శాతం పర్సంటేజ్ తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో దాతలు కూసం రామ్మోహన్ రెడ్డి, ముప్పిడి అనుదీప్ రెడ్డి, జేష్ట శ్రీధర్, వెలి చంద్రశేఖర్, ముద్దన మురళి, భూరెడ్డి వాసు, ఎస్ఎంసి చైర్మన్ గుంజే వెంకటరమణ, హెచ్ఎం సోమశేఖర్ ఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

విశాలాంధ్ర-ఆలమూరు: ఆలమూరు మండలం కొత్తూరు సెంటర్ సమీపంలో కోళ్ల ఫారం వద్ద కాకినాడ-జొన్నాడ ఆర్ అండ్ బి రోడ్డుపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందినట్లు ఆలమూరు ఎస్సై శివప్రసాద్ తెలిపారు. ఆయన వివరాలు ప్రకారం గుమ్మిలేరు గ్రామానికి చెందిన బుంగా పూసయ్య (52) అనే రైతు ద్విచక్ర వాహనంపై కొత్తూరు సెంటర్లో గల పురుగుల మందుల దుకాణానికి వస్తుండగా వ్యాన్ ఢీ కొనడంతో తలకు తీవ్రమైన గాయం అవ్వగా పూసయ్య అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మహిళలకు అండగా జగనన్న ప్రభుత్వం

విశాలాంధ్ర - కాకినాడ : దేశంలోని ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా ఆంధ్రప్రదేశ్‌లో మహిళల సంక్షేమం కోసం ఎన్నో వినూత్న పథకాలను సీఎం అమలు చేస్తున్నారని కాకినాడ పార్లమెంటు సభ్యురాలు వంగా గీతా విశ్వనాథ్ పేర్కొన్నారు. స్థానిక 32 డివిజన్ రామకృష్ణారావుపేట, 29వ డివిజన్ సూర్యనారాయణపురం ప్రాంతాలలో శనివారం వైయస్సార్ ఆసరా సంబరాలను ఘనంగా నిర్వహించారు. ఎంపీ వంగా గీత, సిటీ ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి, కౌడా చైర్ పర్సన్ రాగిరెడ్డి చంద్రకళ దీప్తి, నగరపాలక సంస్థ కమిషనర్ కే రమేష్, ఏడిసి నాగ నరసింహారావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ నగర అధ్యక్షురాలు సుంకర శివ ప్రసన్న, ఎమ్మెల్సీ అభ్యర్థి కర్రి పద్మశ్రీ, నాయకులు కార్యకర్తలు కార్య క్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టీపీ ఆర్ఓ మానే కృష్ణమోహన్, మాజీ డిప్యూటీ మేయర్లు మీసాల ఉదయ్ కుమార్, పసుపులేటి వెంకటలక్ష్మి, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

2న తూర్పుగోదావరి జిల్లా అరసం మహాసభ

విశాలాంధ్ర-రాజమహేంద్రవరం: ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం (అరసం) నూతన తూర్పుగోదావరి జిల్లా శాఖ ప్రథమ మహాసభ వచ్చేనెల ఏప్రిల్ 2వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు రాజ మహేం ద్రవరం ఆర్టీసీ బస్సు కాంప్లెక్స్ వద్ద గల ఆదిత్య డిగ్రీ కళాశాలలో జరుగు తుందని తూర్పుగోదావరి జిల్లా అరసం కన్వీనర్ పడాల వీరభద్రరావు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్యదర్శి బొల్లినేని నాగార్జున సాగర్ అధ్యక్షత వహిస్తారు. ముఖ్య అతిథిగా ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి వల్లూరు శివప్రసాద్, విశిష్ట అతిథులుగా ఆదిత్య విద్యా సంస్థల డైరెక్టర్ ఎస్. పి. గంగిరెడ్డి, నిత్య విద్యార్థి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత డా. కర్రి రామా రెడ్డి, ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర కార్య వర్గ సభ్యులు జి. ఓబులేసు, చెరుకుమల్లి సింగారావు పాల్గొంటారు. ఎస్.ఆర్. పృథ్వీచే రచింపబడిన 'గోదావరి నానీ'ల పుస్తక ఆవిష్కరణ, ప్రజానాట్య మండలి కళాకారులు అభ్యుదయ గేయాల ఆలాపన, తూర్పుగోదావరి జిల్లా అరసం కో కన్వీనర్ డా. బి హెచ్. వి. రమాదేవి సాహితీవేత్తలు, సాహిత్య అభిమానులు పాల్గొనాలని పడాల వీరభద్రరావు కోరారు.

పాటు కాటుకు గురైన రైతు

విశాలాంధ్ర-గోపాలపురం: మండలం లోని వాదాల గుంట గ్రామానికి చెందిన ప్రతిపాటి బాబురావు బంటా పనికి వెళ్లి పాము కాటుకు గురైనట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. రోజువారి పనిలో భాగంగా అదే గ్రామానికి చెందిన ఆచంట రాజు అనే రైతుకి చెందిన కరిచర్లగూడెం గ్రామంలో ఉన్న పొగాకు తోటలో ప్రత్తిపాటి బాబురావు (50) అనే వ్యక్తిని తెల్ల పొడ పాము కాటు వేయగా వైద్య నిమిత్తం గోపాల పురం సామాజిక ఆరోగ్య కేంద్రంకు తరలించగా పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం రాజమండ్రి ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రసుత్తం వైద్యులు బాబురావు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిపారు.

ఏప్రిల్ 12 వరకు డిపాజిట్ల వివరాల పరిశీలన

విశాలాంధ్ర - కాకినాడ : కార్తికేయ కోఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ సభ్యులు తమ డిపాజిట్ల పూర్తి వివరాలను ఈ నెల 12వ తేదీలోగా సమర్పించాలని అసిస్టెంట్ రిజిస్ట్రార్, విచారణ అధికారి ఎన్‌వీఎస్ఎస్ఆర్‌కే దుర్గాప్రసాద్ సూచించారు. ఈ మేరకు ఆయన శనివారమిక్కడ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఫ ప్రభుత్వ పనిదినాల్లో ఉదయం 10.30 గం. నుంచి సాయంత్రం 5 గంటల వరకు విచారణ అధికారి అందుబాటులో ఉంటారని తెలిపారు. సమస్య పరిష్కారం కోసం డిపాజిట్ల జాబితాలను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు దుర్గాప్రసాద్ వెల్లడించారు.

విశాలాంధ్ర గోదావరి జిల్లా

కాకినాడ, తూర్పుగోదావరి, కోనసీమ

ఆదిత్య విద్యా సంస్థల విద్యార్థులు రూ.40 లక్షల విరాళం

విశాలాంధ్ర-కాకినాడ: ప్రఖ్యాత అంతర్జాతీయ మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ అయినటువంటి ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీకి టర్కీ భూకంపం వంటి ప్రకృతి వైపరీత్య బాధితులకు సహాయ సహకారాలు అందించేటందుకు గాను ఆదిత్య విద్యా సంస్థల విద్యార్థులు సమకూర్చిన 40 లక్షల విరాళాల డిమాండ్ డ్రాఫ్ట్‌ను నేడు కాకినాడ రెడ్ క్రాస్ జిల్లా శాఖ అధ్యక్షులు మరియు కలెక్టర్ కృతికా శుక్లా విడుదల చేసారు. ఈ విరాళాన్ని త్వరలోనే రెడ్ క్రాస్ ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు మరియు గవర్నర్ సయ్యద్ అబ్దుల్ నజీర్‌కి అందచేయడం జరుగుతుందని కలెక్టర్ తెలియచేసారు. ఆదిత్య విద్యా సంస్థల చైర్మన్ ఎన్ శేషా రెడ్డి రెడ్ క్రాస్ వైస్ చైర్మన్ మరియు ఆదిత్య విద్యా సంస్థల కార్యదర్శి డా ఎన్ సుగుణా రెడ్డిలకు కలెక్టర్, రెడ్ క్రాస్ చైర్మన్ వైడి రామారావు అభినందించి శుభా కాంక్షలు తెలియచేసారు.

పరసాకు మాతృ వియోగం

విశాలాంధ్ర-అమలాపురం : ఆంధ్రా బ్యాంకు మాజీ డైరెక్టర్ పరసా పరమేశ్వరరావు మాతృమూర్తి పరసా చిట్టికాసులు(97) శనివారం తెల్లవారుజామున కొమరగిరిపట్నం వారి స్వగృహంలో కన్నుమూశారు. ఆమెకు 5గురు కుమారులు, ఒక కుమార్తె. ఆమె మరణం పట్ల టిడిపి రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి మెట్ల రమణ బాబు, మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ ఛాంబర్ అధ్యక్షులు కల్వకొలను తాతాజీ, మేడిద రమేష్ బాబు, కుప్పాల సత్తిబాబు, యెండూరి నాగబాబులు సంతాపం వ్యక్తం చేసారు.

సామాన్యులకు సైతం న్యాయ సహాయం

విశాలాంధ్ర-కొవ్వూరు: సామాన్యులకు సైతం న్యాయసహాయం అందించేందుకు తన వంతుకృషి చేస్తానని కొవ్వూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షురాలుగా ఎన్నికైన ప్రముఖ న్యాయవాది బొబ్బ భారతి అన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ సమాజంలో మహిళలు ఎంతో వివక్షతకు గురవుతున్నారని వారికి న్యాయం చేసే విధంగా పాటుపడతానన్నారు. మహిళా న్యాయవాదులు ఎదుర్కొంటున్న సమ స్యల పరిష్కార దిశగా కృషి చేస్తానన్నారు. ఉపాధ్యక్షుడిగా కోమటి గోపాలకృష్ణ ప్రధాన కార్యదర్శిగా తక్కిళ్ళ చిట్టిబాబు, కోశాధికారిగా వీఆర్పీ ప్రసాద్, స్పోర్ట్స్ సెక్రట రీగా యాదాటి ప్రకాష్‌రావు, మహిళా ప్రతినిధిగా వరుసల రాజేశ్వరి ఎన్నిక య్యారు. వీరి ఎంపిక పట్ల పట్టణ ప్రముఖులు ప్రజాప్రతినిధులు అభినందనలు తెలియజేశారు.

పది పరీక్షలకు సన్నాహాలు

విశాలాంధ్ర-చాగల్లు : మండలంలో ఈ నెల మూడో తేదీ నుండి ప్రారంభం కానున్న పదవ తరగతి పబ్లిక్ పరీక్షలకు అన్ని వసతులు కల్పిస్తున్నామని ఇందుకు సంబం ధించి సన్నాహాలు జరుగుతున్నాయని మండల విద్యాశాఖ అధికారి వి. ఖాదర్ బాబు అన్నారు. ఈ సందర్భంగా శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. దీనిలో భాగంగా ఆయన మాట్లాడుతూ ఈనెల మూడవ తేదీ నుండి 18 వ తేదీ వరకు 10వ తరగతి పరీక్షలు జరుగుతాయన్నారు. ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు సంబంధించి పరీక్షలకు మొత్తం 577 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు చెప్పారు. మొత్తం మూడు పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు బెంచీలు, మంచినీరు, మరుగుదొడ్లు వంటి సౌకర్యాలు సిద్ధం చేశామన్నారు. పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు గంట ముందే చేరుకోవాలని తెలిపారు.

విజయవంతంగా పోషన్ -పఖ్వాడ

విశాలాంధ్ర - కొత్తపేట : స్థానిక మండల పరిషత్‌లో పోషన్ అభియాన్‌లో భాగంగా పోషన్ పఖ్వాడ కార్యక్రమాన్ని నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జెడ్పీటీసీ & స్టేట్ హెచ్ఎంఎడబ్ల్యు మెంబర్ గూడ పాటి రమా దేవి ప్రవీణ్ కుమార్(జిపి) ఎంపిపి మార్గాన గంగాధర్‌లు పాల్గొని గర్భి ణీలకు, బాలింతలకు వైసీపీ ప్రభుత్వం అందజేస్తున్న వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ అందజేశారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సిమాంతం, బాలింత పిల్లలకు అన్నప్రాసన చేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్లు పోషకాలు కలిగిన వంటకాలను తీసుకు వచ్చి వాటి వల్ల కలిగే ప్రయోజనాలను గర్భిణీ, బాలింత స్త్రీలకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ దంగేటి నాగమణి సుబ్రమణ్యం (డిఎస్), సర్పంచులు నెల్లి లక్ష్మీ పతి, బూసి జయ లక్ష్మి, సీపీడీఓ పి శారద తదితరులు పాల్గొన్నారు.

నేడు శ్రీ వివేకానంద గ్రాడ్యుయేషన్ డే

విశాలాంధ్ర - కాకినాడ : శ్రీ వివేకానంద విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకల్తో పాటు యుకెజి విద్యార్థుల గ్రాడ్యుయేషన్‌డే వేడుకల్ని ఏప్రిల్ 2న నిర్వహిస్తున్నట్లు విద్యా సంస్థల కరస్పాండెంట్ బి సరోజని వెల్లడిరచారు. కాకినాడ రూరల్ మండలం ఇంద్ర పాలెం శ్రీవివేకానంద స్కూల్ 31వ, మధురానగర్ బ్రాంచ్ 21వ వార్షికోత్సవ వేడు కల్ని ఒకే వేదికపై నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆదివారం మధ్యాహ్నం 3గంటలకు కాకినాడ సూర్యకళామందిరంలో ప్రారంభ మయ్యే ఈ వేడుకల్లో ఆర్‌జెడి జి నాగమణి ముఖ్యఅతిథిగాను, డిఇఓ కెఎస్‌విఎస్ అన్నపూర్ణ, అన్నవరం దేవస్థానం ట్రస్ట్‌బోర్డ్ మెంబర్ కర్రి భామిరెడ్డి, కాకినాడ కార్పొరేషన్ అదనపు కమిషనర్ సిహెచ్ నాగనరసింహారావులు గౌరవ అతిథులుగా పాల్గొంటారన్నారు. డిప్యూటీ డిఇఓ ఆర్‌జె డానియేల్ రాజు, ఎమ్ఇఓ ఎల్ గణెళిష్‌బాబులు హాజరౌతారన్నారు.

వక్కలంకలో సామూహిక శ్రీమంతాలు

విశాలాంధ్ర-అంబాజీపేట: పి గన్నవరం నియోజకవర్గ అభివృద్ధి ప్రదాత శాసన సభ్యులు కొండేటి చిట్టిబాబు జన్మ దినం సందర్భంగా శనివారం వక్క లంక గ్రామ పంచాయతీ వద్ద సర్పంచ్ వాసంశెట్టి రేవతి పెదబాబు కేక్ కటింగ్ చేసి శు భాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ వాసంశెట్టి రేవతి పెదబాబు సామూహిక శ్రీమంతాలు ఏర్పాటు చేసి వారికి చీర, గాజులు, పండ్లు, పుష్పాలు ఇచ్చి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిల్లి సత్యవేణి రమేష్, వార్డు మెంబర్లు యల్లమిల్లి జయబాబు, మట్టపర్తి లక్ష్మీ వెంకటేశ్వరరావు, కొప్పిశెట్టి శ్రీనివాస్, పిల్లి సూర్యచంద్రరావు, సచివాలయం కన్వీనర్లు వాసంశెట్టి వెంకటశెట్టి, జనుపల్లి ఏడుకొండలు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వాసంశెట్టి రాంబాబు, స్కూల్ కమిటీ చైర్మన్ నాగబత్తుల రాజేష్, ఆర్‌బికె చైర్మన్ వాసంశెట్టి వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి వి. తాతాజీ, సచివాలయ సిబ్బంది, ఎయంయంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడీ సిబ్బంది, వలంటీర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి ఇంటికి

విశాలాంధ్ర - కరప : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికి అందినవి లేనిదే తెలుసుకుని, అర్హులైన కుటుంబాలకు పథకాలు అందించేందుకు గృహ సారథులను నియమించుట జరిగిందని మాజీ మంత్రివర్యులు కురసాల కన్నబాబు పేర్కొన్నారు. కరప మండలం నడకుదురు గ్రామంలో వెలమ కళ్యాణ మండపం నందు శనివారం గృహసారధులకు శిక్షణ అందించుట జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీపీ పెంకి శ్రీలక్ష్మీ సత్తిబాబు అధ్యక్షత వహించగా, జడ్పిటిసి వై సుబ్బారావు, సర్పంచులు సమాఖ్య అధ్యక్షులు రొక్కాల గనిరాజు మండల వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చింత ఈశ్వరరావు, నడకుదురు గ్రామ సర్పంచ్ దేగల లలిత కుమారి, ఆశాజ్యోతి, నాయకులు సవిలే రాజేష్, కృష్ణార్జునరావ్, పైల గోవిందు తదితరులు పాల్గొన్నారు.

మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సేవలు అమూల్యం

విశాలాంధ్ర -భీమవరం: దేశంలోని అతిపెద్ద బంగారు మరియు వజ్రాభరణాల రిటైల్ వ్యాపార సంస్థల్లో ఒకటైన మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ తమ భీమవరం షోరూమును శనివారం పునఃప్రారంభించింది. ప్రారంభోత్సవం లో ముఖ్య అతిథులుగా విచ్చేసిన విధాన పరిషత్ చైర్మన్ కొయ్యే మోషేను రాజు, ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో పేరెన్నిక గల వజ్రాభరణాలను భీమవరం వినియోగదారులకు అందిస్తున్న మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ నిర్వాహకులను అభినందించారు. కార్పోరేట్ బాధ్యతగా సామాజిక స్పృహతో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న మలబార్ గోల్డ్ ను ప్రశంసించారు.మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ ప్రతినిధులు అర్జున్, ఇంతియాజ్, నిఖిల్ చంద్రన్ మాట్లాడుతూ షోరూములో వెరైటీ డిజైన్లతో పాటు, 4.9% నుండి ప్రారంభమయ్యే సహేతుకమైన తరుగు చార్జీలతో విస్తృత శ్రేణిలో ఆభరణాలు అందుబాటులోకి తెచ్చామన్నారు. బంగారు, వజ్రాలు, ప్లాటినం, విలువైన రత్నాభరణాలు, వెండి ఆభరణాలు, పెళ్లి ఆభరణాలు, సాంప్రదాయ ఆభరణాలు, రోజువారీ ధరించే ఆభరణాల విశేషమైన శ్రేణి ఈ మలబార్ షోరూములో ప్రదర్శిస్తున్నామన్నారు. ఎంపిక చేసిన ప్రముఖ ఉప-బ్రాండులైన 'మైన్' డైమండ్ జ్యువెలరీ, 'ఎరా' అనకట్ డైమండ్ జువెలరీ, 'డివైన్' ఇండియన్ హెరిటేజ్ జువెలరీ, 'ఎథ్నిక్స్' హ్యాండ్ క్రాఫ్టెడ్ జ్యువెలరీ కలెక్షన్, ప్రీసియా, విలువైన రత్నాల ఆభరణాల 'జౌల్ జీవనశైలి ఆభరణాలు మొదలగు డిజైన్లను ప్రదర్శనలో ఉంచామన్నారు. ప్రతి 30,000 రూపాయల కొనుగోలుతో 100 మిల్లీ గ్రాముల బంగారు నాణేనికి సమానమైన విలువను అందిస్తున్నామన్నారు. డైమండ్, జెమ్ స్టోన్, పోల్కీ డిజైన్ల ఆభరణాల కొనుగోలుపై 250 మిల్లీ గ్రాముల బంగారు నాణేనికి సమానమైన విలువను పొందవచ్చని 23 ఏప్రియల్ వరకు ఈ ఆఫర్ వర్తిస్తుందని ఈ అవకాశాన్ని సద్వినియోగం వారు విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వినియోగదారులు, శ్రేయోభిలాషులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

లే అవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పన

విశాలాంధ్ర-వీరవాసరం: జగనన్న లే అవుట్ లకు వెళ్ళే రహదారిని యుద్ధ ప్రాతిపదికన నిర్మించి ఇండ్ల నిర్మాణాలు మొదలుపెట్టాలని జిల్లా కలెక్టరు పి. ప్రశాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం వీరవాసరం మండలం బాలేపల్లి గ్రామంలో జగనన్న రెండు లే అవుట్ లను ఆకస్మిక తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జగనన్న లే అవుట్ లలో ఏ ఇబ్బందులు తలెత్తినా వెను వెంటనే జిల్లా దృష్టికి తీసుకు వచ్చినట్లయితే పరిష్కారం చూపుతామని, పనులు ముందుకు సాగుటకు అవకాశం ఏర్పడు తుందన్నారు. రహదారిని వేగ వంతంగా పూర్తి చేసి ఇళ్లను మొదలు పెట్టాలన్నారు. లే అవుట్‌లో మౌలిక సదుపాయాల కల్పనలో పూర్తి దృష్టి పెట్టాలన్నారు. కలెక్టరు వెంట ఇన్‌చార్జి గృహ నిర్మాణ శాఖ పిడి బి.పిచ్చియ్య, ఈఈ బి.వెంకట రమణ, తహశీల్దారు బి.సుందరరాజు, ఇన్‌చార్జి యంపిడివో యన్.ఉమామహే శ్వరరావు, ఇన్‌చార్జి గృహ నిర్మాణ శాఖ ఏఈ, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు, తదితరులు పాల్గొన్నారు.

చిరు ధాన్యాల వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం

విశాలాంధ్ర-టీ నరసాపురం : చిరు ధాన్యాల వినియోగంతో సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని చింతలపూడి సిడిపిఓ పి.మాధవి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు చిరుదాన్యాల ప్రాముఖ్యత పై శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలతో పాటు అనారోగ్య బాధితులు చిరు దాన్యాలు తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని తెలిపారు. గర్భిణులు, బాలింతలు మినరల్స్ ఉండే ఆహార పదార్థాలు ఎక్కువగా తీసుకోవడం ద్వారా రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు. రక్త హీనత వల్ల అనేక అనారోగ్య సమస్యలు తలెత్తుతాయన్నారు. ప్రతిరోజూ చిరు దాన్యాలతో పాటు పాలు, పండ్లు, కోడిగుడ్లు, ఆకుకూరలు కూడా తీసుకోవాలని తెలిపారు. అనంతరం గర్భిణీలకు సీమంతాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్ లు ఎం లక్ష్మీ, ఉష, మణి తదితరులు పాల్గొన్నారు.

రంగా ఆశయ సాధనకు కృషి చేయాలి

విశాలాంధ్ర-ఆకివీడు: వంగవీటి రంగ ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తున్నది ఆకివీడు రాధారంగ మిత్రమండలి అని నగర పంచాయతీ చైర్ పర్సన్ జామి హైమావతి, మాజీ ఏఎంసీ చైర్మన్ మోటుపల్లి గంగాధర్ లు అన్నారు. శనివారం ఆకివీడు మాదివాడ రంగా విగ్రహం వద్ద రాధా రంగ మిత్రమండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన చలివేంద్రాన్ని వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా రంగా విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం వైస్ చైర్మన్ పుప్పాల సత్యనారాయణ, కౌన్సిలర్ నిమ్మల నాగు, మోటుపల్లి కుమారి, గేదెల అప్పారావులు మాట్లాడుతూ పేదల కోసం ఏదైనా చేసే వ్యక్తి రంగ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో చలపతి, డి.వి రమణమూర్తి, మోర జ్యోతి రెడ్డి, షేక్ హుస్సేన్, పుప్పాల చిన్న, సాయి తో పాటు రాధా రంగ మిత్ర మండలి సభ్యులు, రంగా అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

మట్టపర్రులో ఇదేం ఖర్మ

విశాలాంధ్ర -పోడూరు: మండలం లోని మట్టపర్రు లో మండల టీడీపీ కమిటీ ఆధ్వర్వంలో శనివారం ఇదేం ఖర్మ మన రాష్ట్రానికి కార్యక్రమం నిర్వహించారు. మండల టీడీపీ నాయకులు, స్థానిక కార్యకర్తలతో కలిసి ఎమ్మెల్యే నిమ్మల రామానాయుడు గ్రామంలో ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గ్రామానికి టిడిపి హయాంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు జరిగాయని, గత నాలుగు సంవత్సరాలు కాలంలో ఏటువంటి అభివృద్ధి కార్యక్రమం జరగలేదన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు జరగాలంటే రానున్న ఎన్నికలలో టీడీపీ కి ఓటు వెయ్యాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను మండల టీడీపీ అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు నమోదు చేసుకొన్నారు. సర్పంచ్ దొమ్మేటి శ్రీను, టీడీపీ నాయకులు బొక్కా నాగేశ్వరరావు, ఎల్లమెల్లి వెంకటరావు, కుక్కల సత్యనారాయణ, కేతా హరి, తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల స్వచ్ఛీకరణ పూర్తిగా జరగాలి

విశాలాంధ్ర-భీమవరం: రెవిన్యూ రికార్డులు స్వచ్ఛీకరణ ప్రతి గ్రామంలో నూటికి నూరు శాతం జరగాలని జిల్లా జాయింటు కలెక్టరు జె వి మురళి సంబంధిత అధికారులు ఆదేశించారు.శనివారం జిల్లా కలెక్టరేట్ జిల్లా జాయింట్ కలెక్టర్ ఛాంబర్ లో రెవిన్యూ స్వచ్ఛీకరణ పై సబ్ కలెక్టరు,డిఆర్ఓ ,ఆర్డిఓ ,సర్వే అధికారులతో సమీక్షా సమావేశాన్ని జిల్లా జాయింటు కలెక్టరు నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో రెవిన్యూ రికార్డులు స్వచ్ఛకరణ భాగంగా ప్రతి గ్రామంలో ప్రతి భూమి , ప్రతి సర్వే నెంబర్ వద్ద సంబంధిత వీఆర్వో, గ్రామ సర్వేయర్ స్వయంగా వెళ్ళి రెవిన్యూ రికార్డులు , దస్తా వేజులు తనిఖీ చేయాలన్నారు. ఏమైనా లోటుపాట్లు ఉన్నట్లయితే ఆయా రైతులు ఆ యజమానుల సమక్షంలోనే పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమం మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు. కొన్ని చోట్ల మందకొండిగా జరుగుతుందని వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఏక్కడ వివాదాలకు అవకాశం లేకుండా రెవిన్యూ రికార్డు స్వచ్ఛీకరణ జరగాలని జిల్లా జాయింట్ కలెక్టరు జె వి మురళి సూచించారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టరు ఎం సూర్య తేజ, జిల్లా రెవిన్యూ అధికారి కె. కృష్ణ వేణి, డి ఆర్ వో దాసి రాజు, జిల్లా సర్వే అధికారి కె.జాషువా , తది తరులు పాల్గొన్నారు.

మట్టిని విక్రయిస్తే కఠిన చర్యలు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : మట్టిని వ్యాపార నిమిత్తం ఇతరులకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని గనుల శాఖ ఏలూరు జిల్లా సహాయ సంచాలకులు సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. మండలం పరింపూడి గ్రామ రెవెన్యూ పరిధి దిప్పకాయలపాడు గ్రామ శివారు రాజు చెరువులో అక్రమంగా పరిమితికి మించి మట్టి తోలకాలు తోలుతున్నారని ఏలూరు జిల్లా మైనింగ్ ఏడి సుబ్రహ్మణ్యం శనివారం రాజు చెరువును పరిశీలించారు. చెరువు తవ్వకం సక్రమంగా లేదని, మట్టిని తవ్వుకునేవారు వారి ఇష్టం వచ్చిన చోటల్లా చెరువును తవ్వడంతో చెరువులో క్వారీలను తలపించే విధంగా పెద్దపెద్ద గోతులు ఏర్పడ్డాయి. రెవెన్యూ శాఖ ద్వారా పంట పొలం మెరక చేసుకోవడానికి అనుమతి తీసుకున్నప్పుడు మట్టి తోలకాలు పొలంలోనికే తరలించాలన్నారు.ఇతర వ్యాపార నిమిత్తం మట్టిని విక్రయిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. ఈయన వెంట మైనింగ్ శాఖ సిబ్బంది, పరింపుడి విఆర్ఓ రామ్మోహన్రావు, ఇరిగేషన్ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

10 పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి

విశాలాంధ్ర -ఆగిరిపల్లి : జిల్లాలో జరిగే పదవ తరగతి పరీక్షల సందర్భంగా జిల్లా ఎస్ పి రాహుల్ దేవ్ శర్మ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా పోలీస్ సిబ్బందికి, మహిళా పోలీసులకు పలు సూచనలను,ఆదేశాలను జారీ చేశారు.పరీక్ష కేంద్రాల వద్ద ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏ ఒక్కరికి ఫోన్లు అనుమతించకూడదని, పరీక్ష కేంద్రాలకు దగ్గర్లో ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసి వేయించాలన్నారు.విద్యార్థులను గం.9:30 లోపే పరీక్ష హాల్లోకి అనుమతించాలని, పోలీస్ సిబ్బంది, మహిళా పోలీసులు అందరికంటే ముందుగా పరీక్షా కేంద్రాల వద్ద 7.30 కల్లా ఉండాలన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయాలని,పోలీస్ పెట్రోలింగ్ చేయాలని ఆదేశించారు. ఆగిరిపల్లి పోలీస్ స్టేషన్ నందు ఆగిరిపల్లి ఎస్ఐ నంబూరు చంటిబాబు, మండల మహిళా పోలీసులందరూ ఈ జూమ్ కాన్ఫరెన్స్ లో పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా మాడెం సత్యనారాయణ

విశాలాంధ్ర -కైకలూరు : కైకలూరు బార్ అసోసియేషన్ నూతన అధ్యక్షులుగా మాడెం వీర వెంకట సత్యనారాయణ ఎన్నికయ్యారు. స్థానిక బార్ కార్యాలయంలో జరిగిన ఎన్నికలలో ఆయన అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. సీనియర్ న్యాయవాది తుమ్మలపల్లి బాలకృష్ణారావు ఎలక్షన్ ఆఫీసర్ గా వ్యవహరించగా దీనిలో వైస్ ప్రెసిడెంట్ గా ఎం ఎస్ ఎస్ రాజు, సెక్రటరీగా బందెల లక్ష్మణరావు, జాయింట్ సెక్రటరీగా చావలి శంకర్ శాస్త్రి, ట్రెజరర్ గా జే గంగ ఫణీంద్ర లక్ష్మి, మహిళా ప్రతినిధిగా ఎండి రజీమున్నిసా,మహిళ సెక్రటరీగా కే రమాదేవి, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా కే.మురళి పవన్ ఎన్నికయ్యారు. సందర్భంగా పలువురు సీనియర్ న్యాయవాదులు టి. శ్రీనివాసరావు, గురజాడ ఉదయ్ శంకర్, వడ్లని శ్రీరామచంద్రమూర్తి, కారే శరత్ బాబు, అడ్డగర్ల రాంబాబు, మాడపాటి సత్యనారాయణ రాజు, బి. ఇందిర పలువురు న్యాయ వాదులు నూతన బార్ కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేశారు.

వృద్ధులకు ప్రోటీన్ కిట్స్ పంపిణీ

విశాలాంధ్ర - అమలాపురం : శ్రీహరి హాస్పిటల్ పేరమ్మ అగ్రహారం. వైద్యులు డాక్టర్ శ్రీహరి రాయులు. ఎండి జనరల్ మెడిసిన్ వీరి పుట్టినరోజు సందర్భంగా శనివారం స్థానిక సెయింట్ జోసెఫ్ ఓల్డ్ ఏజ్ హోమ్‌లో గల వృద్ధులకు ప్రోటీన్ కిట్స్ అందజేశారు. ఫ్రూట్స్, బిస్కెట్స్, టాట గ్లూకోజ్ డ్రింక్స్‌తో కూడిన కిట్లను వృద్ధాశ్రమంలో సేద తీరుతున్న వృద్ధులకు పంపిణీ చేశారు. ప్రతి సంవత్సరం తన పుట్టినరోజు పురస్కరించుకొని ఏదో ఒక సేవా కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ శ్రీహరి రాయులు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీహరి రాయులుతో పాటు మెడికల్ రిప్రజెంటేటివ్ అరుణ్ కుమార్, ఓల్డ్ ఏజ్ హెూం నిర్వాహకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు కన్నబాబు పరామర్శ

విశాలాంధ్ర - కరప : ఇటీవల కాలంలో మృతి చెందిన వారి కుటుంబాలను మాజీ మంత్రి, కాకినాడ రూరల్ శాసనసభ్యులు కురసాల కన్నబాబు శనివారం పరామర్శించారు. కరప ప్రముఖ న్యూస్ ఛానల్ టివి 5 రిపోర్టర్ దేవగుప్త మూర్తి,రాజ్ న్యూస్ రిపోర్టర్ సాంబశివరావు తండ్రి వీరభద్రరావు అనారోగ్యంతో మృతిచెందగా వారి కుటుంబాన్ని ఓదార్చారు. కరప గ్రామంలో చోడపునిడి కొండ మృతి చెందగా వారి కుటుంబ సభ్యులను ఓదార్చరు. పేపకాయల పాలెం గ్రామంలో సాఫ్ట్వేర్ ఉద్యోగి పి మణికంఠ, గొడ్డటపాలెం గ్రామంలో వాసంశెట్టి అప్పారావు, కరప గ్రామం నాగాల చంద్రమ్మ, తదితర కుటుంబాలను కన్నబాబు పరామర్శించారు. ఎంపిపి పెంకే శ్రీలక్ష్మి సత్తిబాబు, నక్కాసత్తిబాబు, చంటి, సర్పంచ్ ఆశాజ్యోతి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణకు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలి

విశాలాంధ్ర-భీమవరం : ధాన్యం సేకరణకు సంబంధించి ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేసుకుని ,రైతులకు కనీస మద్దతు ధర అందించేలా పూర్తి స్థాయిలో ధాన్యం కొనుగోలు చేయాలని సంబంధిత అధికారులను జిల్లా జాయింటు కలెక్టరు జేవీ మురళి ఆదేశించారు. శనివారం జిల్లా

కలెక్టరేట్ జిల్లా జాయింటు కలెక్టరు ఛాంబరులో సంబంధిత అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ చైర్మన్, లారీ అసోసియేషన్ ప్రతినిధులతో జిల్లా జాయింటు కలెక్టరు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాయింటు కలెక్టరు మాట్లాడుతూ రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు 2023 లో రైతులందరూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ సద్వినియోగం చేసుకునేలా పటిష్టమైన చర్యలు తీసుకో వాలన్నారు. గ్రామంలో గ్రామ సభలు ద్వారా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రైతు బరోసా కేంద్రాల్లో సిబ్బందికి , టెక్నికల్ సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని అయన తెలిపారు. కంట్రోల్ రూమ్ ఏర్పాటు చెయ్యాలని ఎవరికి ఏ సమస్య తలెత్తినా కంట్రోల్ రూమ్ కి ఫోన్ చేసి తమ సందేహాలు నివృత్తి చేసుకోవాలన్నారు.గత ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలు అనుభవాలను దృష్టిలో ఉంచుకొని రబీలో అటువంటి అంశాలు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు రబీ సీజన్ లో ధాన్యం సేకరణను ప్రారంభించే ముందు టెక్నికల్ పర్సన్ ద్వారా తేమ మీటర్ల అన్నింటిని పరిశీలన చేయాలని ఆదేశించారు. క్షేత్రస్థాయిలో అవసరాన్ని గుర్తించడం ద్వారా కిసాన్ డ్రోన్ల ను రైతుభరోసా కేంద్రాల ద్వారా గ్రౌండింగ్ చేయాలన్నారు. ధాన్యం కొనుగోలులో ఎక్కడ ఏ రైతుకుకు ఇబ్బందులు తలెత్తకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.ఈ సమీక్షా సమావేశంలో సబ్ కలెక్టరు ఎం. సూర్య తేజ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి జెడ్. వెంకటేశ్వరావు, డీఎస్ఓ యన్. సరోజ, సివిల్ సప్లై డి యం టి. శివ రామ ప్రసాద్, జిల్లా ట్రాన్స్ పోర్టు అధికారి టి.ఉమామహేశ్వర రావు, డి సి వో యం.రవి కుమార్,డి ఎల్ డి ఓ కె సి హెచ్ అప్పా రావు, తర అధికారులు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీరామరాజు, వైస్ ప్రెసిడెంట్ జయరాజు, లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి సభ్యులు, తది తరులు పాల్గొన్నారు.

అనపర్తిలో గడపగడపకు ఎమ్మెల్యే

విశాలాంధ్ర - అనపర్తి : స్థానిక పాత ఊరిలో ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం శనివారం నిర్వహించారు. లబ్ధి పొందిన పథకాలను లబ్ధిదారులకు ఎమ్మెల్యే సత్తి వివరించారు. స్థానిక సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి అధికారులను అక్కడికక్కడే ఆదేశించారు. జగన్మోహన్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి చేయాలంటూ లబ్ధిదారులను ఎమ్మెల్యే సూర్యనారాయణ రెడ్డి కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్, పార్టీ మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), జెడ్పీటీసీ సత్తి గీతా వరలక్ష్మి వెంకటరెడ్డి, పార్టీ పట్టణ అధ్యక్షులు నల్లమిల్లి మురళి, పార్టీ వాణిజ్య విభాగ అధ్యక్షులు సత్తి శ్రీనివాసరెడ్డి, సర్పంచ్ వారా కుమారి, ఉప సర్పంచ్ చిర్ల వీర్రాఘవరెడ్డి, యువ నాయకులు మల్లిడి నితిన్ రెడ్డి, పలువురు ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కూచిపూడి కోర్సులకు ఆహ్వానం

విశాలాంధ్ర - రాజానగరం : తమ విశ్వవిద్యాలయం లోని డిప్లమా ఇన్ కూచిపూడి కోర్సుకు దరఖాస్తులు, కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ఆధ్వర్యంలో డిప్లమా ఇన్ కూచిపూడి పార్ట్ టైం కోర్సుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఆదికవి నన్నయ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య టి.అశోక్ అన్నారు. ఇందుకు సంబంధించి పత్రిక ప్రకటన శనివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాది కాలపరిమితితో 20 సీట్లతో అనుభవజ్ఞులైన అధ్యాపకురాలిచే డిప్లొమా కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. ఇంటర్మీడియట్, డిప్లమా పూర్తి చేసిన మహిళా అభ్యర్థులు మాత్రమే కోర్సులో చేరేందుకు అర్హులని చెప్పారు. అర్హత, ఆసక్తి గల విద్యార్థులు ఈ నెల 3వ తేదీ నుండి 18వ తేదీ వరకూ దరఖాస్తు చేసుకోవచ్చునని తెలిపారు. మరిన్ని వివరాలకు డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ 0883-256611, 9912662500 నెంబర్లను సంప్రదించగలరు.

మా ఆశ నువ్వే..మా నమ్మకం నువ్వే జగన్

విశాలాంధ్ర - కాకినాడ రూరల్ : కాకినాడ ఎన్‌ఎఫ్‌సిఎల్ రోడ్డు, శుభం కాపు కళ్యాణమండపంలో కాకినాడ రూరల్ నియోజకవర్గానికి చెందిన కాకినాడ అర్బన్ లోని 8 డివిజన్ల వైఎస్సార్ సీపీ కన్వీనర్లు, గృహసారథులతో కలిసి మా నమ్మకం నువ్వే జగన్ అనే నినాదంతో మాజీ కార్పొరేటర్ వైసిపి నాయకులు వడ్డీ మణి కుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమా వేశంలో ముఖ్య అతిథిగా కాకినాడ రూరల్ నియోజక వర్గ శాసనసభ్యులు, వైస్సార్ కాంగ్రెస్ పార్టీ కాకినాడ జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రివర్యులు కురసాల కన్నబాబు, మరియు ఎంపీ వంగా గీత విశ్వనాథ్, కాకినాడ రూరల్ నియోజకవర్గ అభివృద్ధి కమిటీ చైర్మన్ కురసాల సత్యనారాయణ పాల్గొన్నారు.

ఈ సందర్భంగా కన్వీనర్లు గృహసారథులు సీఎం జగన్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను వైసిపి కార్యకర్తలతో ఇంటింటికి వెళ్లి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉభయగోదావరి జిల్లాల మహిళా విభాగం ఇంచార్జ్ జమ్మల మడక నాగమణి 47 డివిజన్ మాజీ కార్పొరేటర్ రాజారపు వెంకటలక్ష్మి కుమార్ వైసిపి నాయకులు పాలిక రమణ, భువనేశ్వరి, దైవ కృప, నేరెళ్ళు, జగన్నాథం, విజయ్, తదితరులు పాల్గొన్నారు.

పేద రైతులను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌కు వినతి

విశాలాంధ్ర - కాకినాడ : పట్టాలిప్పిస్తానని రెండు వందల మంది రైతులను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ జగ్గంపేట మండలం మర్రిపాక గ్రామానికి చెందిన పలువురు రైతులు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి శనివారం చేరుకుని తమ ఆవేదనను ఫిర్యాదు పూర్వకంగా తెలియజేశారు. సుమారు వందల యేళ్ళ నుండి సాగు చేసుకుంటున్న భూమికి హక్కులు కల్పించి పట్టాలు ఇప్పిస్తానని అదే గ్రామానికి చెందిన వ్యక్తి సుమారు 200 మంది రైతుల వద్ద 20 వేల నుండి 30 వేల వరకు వసూలు చేసి ఆ సొమ్ముతో ఆ భూమి తన పేరు మీద తన స్నేహితుడు పేరు మీద పట్టాలు పొంది పట్టాదారు పాస్ పుస్తకం టైటిల్ డీడ్ వంటి రెవిన్యూ హక్కులు పొంది తోటి రైతులను మోసం చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కార్యాలయానికి చేరుకొని కలెక్టర్కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ 1950సంవత్సరం నుండి తమ ఆధీనంలో ఉన్న భూమిని సాగుచేసుకొంటూ తమ పూర్వీకులు కుటుంబ పోషణ సాగిస్తున్నారని అదే బాటలో తాము కూడా వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నామని తెలిపారు. ఈ నేపథ్యంలో తమలో ఒకరిగా ఉన్న సాకా కృష్ణారావు అనే వ్యక్తి ఎప్పటి నుండో మన ఆధీనంలో ఉన్న భూమిని కాపాడు కునేందుకు పట్టాలు తెస్తానని అందుకు చాలా డబ్బులు ఖర్చు అవుతుంది అని చెప్పి ఒక్కొక్క రైతు వద్దా 20 వేల నుండి 30 వేల వరకు వసూలు చేసి వచ్చిన సొమ్ముతో స్థానిక రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆ భూమిని తన పేర కొంత, కర్నూలుకు చెందిన తన స్నేహితుడు మునిగేరు మదన్ మోహన్ పేరు మీదా పట్టాదారు పాసుపుస్తకాలు, టైటిల్ డీడ్లను సృష్టించుకుని ఇపుడు ఆ భూమి అంతా తనకే చెందుతుందని అంటున్నాడని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి తక్షణ విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని వారు కోరారు.

జాతీయ స్కాలర్ షిప్ పరీక్షకు శిక్షణ ఇచ్చిన హేమకు సన్మానం

విశాలాంధ్ర - కాట్రేనికోన : ఇటీవల దేశ వ్యాప్తంగా నిర్వహించిన యన్‌యంయంయస్ పోటీపరీక్షల్లో మారుమూల కాట్రేనికోన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుండి పది మంది విద్యార్థులను అర్హత సాధించేటట్టు చేయడం నభూతో నభవిష్యత్ అని పాఠశాల విద్యాకమిటీ చైర్మెన్ గిడ్ల శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఉన్నత పాఠశాలలో విధ్యాకమిటీ చైర్మెన్ అధ్యక్షతన ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లితండ్రులు అభినందన సభ నిర్వహించారు. ఈ అభినందన సభలో ఇటీవల పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థులు నేషనల్ మెరిట్ మినిట్స్ స్కాలర్ షిప్స్‌కు ఎంపిక అయ్యేటట్టు విద్యార్థులను తిర్చిదిద్దిన సైన్స్ మాస్టర్ లంకె హేమ శ్రీనివాస్‌కు విద్యార్థుల తల్లితండ్రులు, పాటశాల ప్రధానోపాధ్యాయులు, సహచర ఉపాధ్యాయులు ప్రత్యేక అభినందనలు తెలిపారు. శ్రీనివాస్‌కు దుశ్శాలువా కప్పి పూలమాలలతో సత్కరించారు. అనంతరం నేషనల్ స్కాలర్ షిప్స్ అర్హత సాధించిన విద్యార్థుల తల్లితండ్రులు సన్మాన గ్రహీత యల్‌హెచ్ శ్రీనివాస్‌కు బంగారు ఉంగరం బహూకరించారు. ఈ సన్మాన కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వరరావు, ఉపాధ్యాయులుబి శ్రీవల్లి, సీత మహాలక్ష్మి, రాజు, గ్రామ పంచాయతీ సర్పంచ్ గంటి వెంకట సుధాకర్, గ్రామ పెద్దలు నల్లా నరసింహమూర్తి, జగడం బాలయ్య, అయితాబత్తుల శ్రీనుబాబు, నందిక శ్రీనివాస్, నల్లా రాంబాబు, పాశం చంద్రరావు, వాసంశెట్టి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తెదేపా ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

విశాలాంధ్ర - గోపాలపురం : బాటసారుల, ప్రజల దాహార్తి తీర్చడానికి తెదేపా నాయకులు చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమని గోపాలపురం ప్రాంతీయ ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఆబోతు అనిల్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక చెక్పోస్ట్ సెంటర్ మరియు ఆర్టీసీ బస్టాండ్ సెంటర్ వద్ద తెదేపా నాయకులు పిన్నమనేని రోహిత్, మద్దిపాటి రమేష్, ఈలి శరత్ బాబు, కుందుల నారాయణ ఆర్థిక సహకారంతో చలివేంద్రాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తెదేపా నాయకులను అభినందించారు, లీటరు మంచినీళ్లు 20 రూపాయలకు అమ్మే ఈ కాలంలో తెదేపా నాయకులు తమ ఆర్థిక సహకారంతో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. సామాజిక సేవలు అందించడంలో తెలుగుదేశం పార్టీ అగ్రగామిగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో గోపాలపురం ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులు దాసరి రామారావు కోశాధికారి టి. గాబ్రియల్, సహాయ కార్యదర్శి చిర్రా కృపారావు, జానపాటి కిషోర్, తెదేపా నాయకులు కూన పాము ప్రసాద్, ఎస్కే సికిందర్, జేష్ఠ శ్రీనివాసరావు, తానేటి వీరరాఘవులు, మల్లిపూడి సుబ్బారావు, శ్రీనివాస్, పలువురు తెదేపా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

గెలుపు ఓటములు సహజం

విశాలాంధ్ర - రాజానగరం : క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని,రెండింటిని సమానంగా స్వీకరించాలని గైట్ ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ డాక్టర్ పి.సుబ్బరాజు అన్నారు. మండలంలోని గైట్ కళాశాలలో గత రెండు రోజులుగా జరిగిన జెఎన్టియూకె సెంట్రల్ జోన్ చదరంగం,షటిల్ బ్యాడ్మింటన్ క్రీడాపోటీలు శనివారం ముగిశాయి.విజేతలకు బహుమతులు ప్రదానం చేసేందుకు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ నేటి ఓటమి రేపటి గెలుపుకు పునాది అన్నారు.అయితే పోటీల్లో పాల్గనడం ముఖ్యమన్నారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వి.ఎస్.ఎన్. మూర్తి,వ్యాయమ అధ్యాపకులు డాక్టర్ సి ఎం హెన్రీ,తదితరులు పాల్గొన్నారు.

సాటివారికి సాయపడదాం : డాక్టర్ చప్పిడి

విశాలాంధ్ర - కాకినాడ : అసోసియేషన్ అఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కాకినాడ మేముసైతం మీకోసం క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ నూతన అధ్యక్షులు అలై ఎంవివి గణేష్ అధ్యక్షతన వాకలపూడి గ్రీన్ ఫీల్డ్ అందుల ఆశ్రమ పాఠశాలలో క్లబ్ పూర్వపు కోశాధికారి అలై పి ప్రసన్న స్నేహితురాలు శ్వేత షిండే జన్మదినం సందర్భంగా విద్యార్థులకు నెలకు సరిపడా కిరాణా సరుకులు, అల్పాహారం అందించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ కమిటీ చైర్మన్ అలై డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, విశిష్ట అతిథిగా అలయన్స్ క్లబ్స్ డిస్ట్రిక్ట్ 106 వైస్ గవర్నర్ అలై వనుం శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ చప్పిడి మాట్లాడుతూ సాటి వారికి సహాయ పడాలంటే మనకి గొప్ప మనసు ఉండాలని మనం చేసే చిన్న సహాయం వారికి ఎంతో ఆనందాన్ని, ఆత్మస్థైర్యాన్ని ఇస్తుందని జన్మదిన సందర్భంగా అందులో ఆశ్రమం నందు వారికి అవసరమైన సరుకులను ఇవ్వడం చాలా ఆనందంగా ఉందని ప్రతి ఒక్కరూ ఇలాంటి కార్యక్రమాలు చేసి సాటివారికి సాయపడాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ నూతన కార్యదర్శి అలైను బి. సత్య కోశాధికారి అలై బి. శ్రీను, క్లబ్ పూర్వపు అధ్యక్షురాలు అలై మన్యం దుర్గా సుభద్ర మరియు క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

పల్లంకుర్రులో ఘనంగా వెంకటేశ్వర స్వామి కళ్యాణం

విశాలాంధ్ర - కాట్రేనికోన : పల్లంకుర్రులో శ్రీవెంకటేశ్వర స్వామి వారి కల్యాణం శనివారం ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మండపంలో స్వామివారిని అమ్మవార్లను ఉత్సవమూర్తులుగా అలంకరించి అర్చకస్వాములు కల్యాణ వేదికపై తీసుకువచ్చి శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాంగల్యపూజ, మాంగల్య ధారణ కార్యక్రమాలు వేడుకగా నిర్వహించారు. వేదమంత్రాల నడుమ వెంకటేశ్వరుని కల్యాణాన్ని కంచుస్తంభం శ్రీలక్ష్మి దుర్గా, పళ్లంరాజు దంపతుల చేతుల మీదుగా అర్చకులు సుదర్శన ఫణి, రాంబాబు, జనార్దన్ ఆచార్యులు అర్చక బృందం కనుల వైభవంగా కల్యాణం జరిపించారు. కళ్యాణానికి విశేష సంఖ్యలో హాజరైన భక్తులు కల్యాణాన్ని కనులారా తిలకించి పులకించిపోయారు. కళ్యాణ కార్యక్రమం తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. శ్రీభూసమేత శ్రీ వేంకటేశ్వర స్వామి వారి ఆలయ నిర్వాహకులు కశిరెడ్డి ఆనంద్ పర్యవేక్షణలో బారీ అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు తీర్థం జరిగింది. అనంతరం స్వామి వారి లడ్డును కసిరెడ్డి ఆనంద్ కుమార్తె కసిరెడ్డి సరయు వేలంలో పాడుకొన్నారు.